

సిఎం చంద్రబాబును కలిసిన ఎంఎల్ఎ 'దాట్ల'



సిఎంను సన్మానిస్తున్న ఎంఎల్ఎ దాట్ల

ప్రజాశక్తి-ముమ్మిడివరం

రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబును ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. మంగళగిరి లోని రాష్ట్ర సచివాలయం లో గురువారం నూతన ముఖ్యమంత్రిగా సిఎం పేషీలో బాధ్యతలు చేపట్టిన చంద్రబాబును ముమ్మిడివరం ఎంఎల్ఎగా విజయం సాధించిన సుబ్బరాజు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎగా భారీ మెజార్టీ సాధించిన సుబ్బరాజు ను సీఎం చంద్రబాబు అభినందించారు.

శాఖల కేటాయింపుపై ఉత్కంఠ

- పవన్‌కు డిప్యూటీ సిఎంతో పాటూ పంచాయతీరాజ్ శాఖ?
- కందుల దుర్గేష్‌కు పర్యాటకం, సినిమాటోగ్రఫీ?
- వాసంశెట్టి సుభాష్‌కు ఎక్సైజ్ శాఖ?

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మంత్రులకు శాఖల కేటాయింపుపై ఇంకా ఉత్కంఠ కొనసాగుతుంది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత శాఖల కేటాయింపుపై ప్రకటన చేస్తారని అందరూ భావించారు. అనుకున్నట్టుగానే గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతలను చేపట్టారు. హామీల మేరకు మొదటి సంతకం మెగా డిఎస్‌సిపై పెట్టారు. తరువాత పింఛన్లు, నైపుణ్య గణన, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు ఫైళ్లపై సంతకాలు చేశారు. తరువాత సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. అయితే రాత్రి 11 గంటలకు కూడా ఎలాంటి ప్రకటన రాకపోవడంతో మంత్రులతో పాటూ జిల్లా ప్రజల్లోనూ ఉత్కంఠ నెలకొంది. అందరూ టివీలకు అతుక్కుపోయారు. ఉదయం నుంచి శాఖల కేటాయింపు కోసం న్యూస్ ఛానళ్లను చూస్తూ గడిపారు. మంత్రులకు శాఖల కేటాయింపుపై ఉండవల్లిలోని తన నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కసరత్తు చేస్తున్నారు. అభియిష్టాల మేరకే శాఖలను కేటాయిస్తామని ఇప్పటికే ఆయన స్పష్టం చేశారు. పవన్‌తో పాటూ లోకేష్‌కు కీలక శాఖలు అప్పగించే అవకాశం ఉంది. అలాగే సీనియర్లకు హోమ్, ఆర్థిక శాఖ వంటి కీలక శాఖలను అప్పగించనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. గురువారం రాత్రి లేదా శుక్రవారం నాటికి శాఖలను కేటాయించి ముఖ్యమంత్రి ప్రకటన చేసే అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముగ్గురు ఎంఎల్ఎలు అమాత్య పదవులను దక్కించుకున్నారు. జిల్లాలో మంత్రి పదవుల కేటాయింపులో జనసేనకు చంద్రబాబు పెద్ద పీట వేశారు. జనసేనకు రెండు, టిడిపికి ఒక మంత్రి పదవిని కేటాయించారు. కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి పోటీచేసి విజయం సాధించిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన కందుల దుర్గేష్, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



పవన్‌కళ్యాణ్



కందుల దుర్గేష్



వాసంశెట్టి సుభాష్

జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన వాసంశెట్టి సుభాష్‌లకు చంద్రబాబు కేబినెట్‌లో స్థానం కల్పించారు. గోరంట్ల బుచ్చియ్య చౌదరి, జ్యోతుల నెహ్రూ, యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప వంటి సీనియర్లను కాదని కొత్త ముఖాలకు చంద్రబాబు మంత్రుల బాధ్యతను అప్పగించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. మంత్రివర్గంలోకి కొత్తనీరు చేరడంతో అందరూ ఆసక్తిగా ఉన్నారు. మంత్రుల జాబితాతో పాటే శాఖల కేటాయింపు కూడా ఉంటుందని అందరూ అనుకున్నారు. కాని అలా కాకుండా చంద్రబాబు ప్రమాణం చేసిన తరువాత వరుగా మంత్రులు శాఖలు లేకుండానే ప్రమాణ స్వీకారం చేశారు.

ఇందులో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు డిప్యూటీ సిఎంగా పదవి దాదాపుగా ఖరారైనట్టు తెలుస్తోంది. అయితే దీనితో పాటూ మరో కీలక బాధ్యతను చంద్రబాబు అప్పగించనున్నారనే వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. పవన్‌కళ్యాణ్ కోరిక మేరకు గ్రామీణ నేపథ్యం ఉన్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణ శాఖను అప్పగించే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. అలాగే కందుల దుర్గేష్‌కు పర్యాటకం, సినిమాటోగ్రఫీ, వాసంశెట్టి సుభాష్‌కు ఎక్సైజ్ శాఖలు కేటాయిస్తారనే వార్తలు రెండు రోజులుగా హల్‌చల్ చేస్తున్నాయి. అయితే దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడంతో అందరూ ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. మంత్రుల లిస్ట్‌ను ప్రకటించడంలోనూ చాలా జాప్యం జరిగింది. చర్చోపచర్చల అనంతరం అర్ధరాత్రి ముగిసిన తరువాత మంత్రుల జాబితాను చంద్రబాబు ప్రకటించారు. మంత్రులకు శాఖలను కూడా అర్ధరాత్రి తరువాతే ప్రకటించే అవకాశం కనిపిస్తోంది. .

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు డిమాండ్



కూలీలతో మాట్లాడుతున్న కారెం వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం అమలాపురం మండలం బండారులంక నడిపూడి గ్రామంలో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి కోపం వచ్చినప్పుడల్లా ఉపాధి చట్టాన్ని ఎత్తి వేస్తామని అంటున్నాడని, గ్రామాల్లో ఉన్న పెత్తందారులు కూడా అదేమాట అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితిలో ఈ పథకం రద్దు అవ్వకుండా పోరాటం చేస్తామని హెచ్చరించారు. పంటకాలవలను మురుగు డ్రయిన్లగా మార్చేస్తున్నారని, డ్రైనేజీ వ్యర్థాలు, గాజు సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు పంటకాలువుల్లో పడేయడం వలన ఉపాధి పథకంలో పనులు చేస్తున్న కూలీలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కూలీలు వాపోయారు. ఈ పథకాన్ని కాపాడుకుంటేనే కార్మికులకు ఎంతో కొంత మేలు జరుగుతుందని తెలిపారు. ఉపాధి కార్మికులకు పనిదినాలు 200రోజులు పెంచాలని, కూలి రేట్లు రూ.600పెంచాలని, ఫే స్లిప్ గతంలో ఇచ్చే విధానంగా ఇప్పుడు కూడ ఇవ్వాలన్నారు. కార్మికులు ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి ఎలాంటి ఇన్సూరెన్స్ సదుపాయామూ లేదన్నారు. వీరికి రూ.5లక్షల ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చాలా గ్రామాల్లో మెడికల్ కిట్లు, టెంట్లు కూలీలకు ఇవ్వడం లేదని, అన్ని గ్రామాలకు మేట్లకు మెడికల్ కిట్లు టెండూ అందించే ఏర్పాట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని కావాలనే నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. ఉపాధి హామీ చట్టం నిధులు కోత విధించి ఉపాధి కూలీలకు ఉపాధి చట్టాన్ని దూరం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పొలమూరి శ్రీనివాసరావు, మేట్లు ఎం.రాజేశ్వరి, జి.తేజ కుమారి, టి.లక్ష్మీ శ్రీదేవి, దుర్గాదేవి, ఎస్.నాగలక్ష్మి, జి.మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్

ముమ్మిడివరం : ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం రూ.600 అందించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పొలమూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అయినాపురం గ్రామంలో జాతీయ ఉపాధి హామీ చట్టంలో చేపట్టిన పనులను చేస్తున్న ఉపాధి కూలీల సమస్యలను శ్రీనివాస్ బందం అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించాలని, రోజు వారి కనీస వేతనం రూ.600 మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వేసవి తీవ్రతను తట్టుకోలేక రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 45 మంది ఉపాధి కూలీలు మత్యువాత పడ్డారని, మతుల కుటుంబాలకు తక్షణమే రూ.5 లక్షలు ఎక్స్ గ్రేషియా అందించి వారి కుటుంబాలను అదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జిల్లా నాయకుడు జగడం నాగేశ్వర రావు ఉపాధి హామీ మెట్లు కొప్పిశెట్టి భగవతి దుర్గా మెల్లం నాగలక్ష్మి గెడ్డం సుమలత తదితరులు పాల్గొన్నారు.



అయినాపురంలో ఉపాధికూలీలతోవ్యవసాయకార్మిక సంఘ నాయకులు

నేడు జిల్లా స్థాయి ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ప్రజాశక్తి-అమలాపురం

ప్రపంచ పర్యావరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 14న శుక్రవారం జిల్లాస్థాయి ప్రభుత్వ కార్యక్రమం ఐ.పోలవరం మండల పరిధి లో జి.వేమవరం జెడ్‌పి ఉన్నత పాఠశాల నిర్వహిస్తారని జిల్లా సైన్స్ అధికారి జివిఎస్.సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజం లోని ప్రజలందరి సమిష్టి యిఔషితోనే పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సమతుల్యత చర్య లు బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ కొరకు మొక్కలు నాటడం పర్యావరణానికి హాని కలిగించే అంశాలను అంశాలపై నినాదాలతో ఎపి రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహిస్తుందన్నారు. ఈనెల 17వ తేదీ వరకు వివిధ రకాల పర్యావరణహిత కార్యక్రమాలు నిర్వహించాలని విద్యాశాఖ లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. దానిలో భాగంగా జిల్లాస్థాయి ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు జి.వేమవరంలో నిర్వహిస్తా మన్నారు. అనాలోచిత మానవ చర్యలవల్ల పర్యా వరణానికి వాటిల్లుతున్న అనర్థాల గురించి ప్రజలకు తెలియ జెప్పేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు.

కేన్సర్‌పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కేన్సర్ పై అవగాహన సదస్సును రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో గురువారం నిర్వహించారు. ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ప్రవీణ్ మాట్లాడారు. నేడు ప్రపంచంలో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని ఇది చాలా ఆందోళన కలిగించే విషయమన్నారు. క్యాన్సర్ పట్ల వైద్యులతో పాటు ప్రజలు కూడా అవగాహన కలిగి ఉండాలని వివరించారు. పొగాకు, నిల్వ చేసిన ఆహార పదార్థాలు, అధిక ప్లాస్టిక్ వినియోగం, కూల్ డ్రింక్‌లు, శీతల పానీయాలు క్యాన్సర్ కు జంక్‌ఫుడ్‌లు మారుతున్న ప్రపంచంలో వాతావరణ కాలుష్యం కూడా ఆందోళనకరంగా పరిణమించిందని ఆయన వివరించారు. వైద్యులు వైద్య సిబ్బంది సరైన అవగాహనతో క్యాన్సర్ కేసులు నిర్ధారించి సకాలంలో గుర్తిస్తే వైద్యం ద్వారా చాలావరకు ఆధునిక మందులు ఉపయోగపడతాయని, పలు అంశాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, ఎఎన్ఎం లో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి: డిఇఒ

ప్రజాశక్తి ముమ్మిడివరం

ఉపాధ్యాయులు మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ, విద్యాపరంగా విద్యార్థులను ఉన్నత వంతులుగా తీర్చిదిద్దాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి సూచించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల్లో గురువారం ప్రధానోపాధ్యాయురాలు పరిమళ అధ్యక్షతన గురువారం స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిఇఒ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థినిలకు స్టూడెంట్ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది పదవ తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్ర స్థాయిలో 4వ స్థానంలో నిలిచిందన్నారు. ఈ విద్యా సంవత్సరం మెరుగైన స్థానం సాధించేందుకు ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా పని చేసి జిల్లాను అగ్రస్థానంలో నిలపాలన్నారు. దానికి



స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేస్తున్న డిఇఒ ఎం.కమలకుమారి


అనుగుణంగా విద్యా సంవత్సరం ప్రారంభమైన మొదటి రోజు నుంచే ప్రణాళికా బద్ధంగా ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు ప్రతి విద్యార్థికి స్టూడెంట్ కిట్స్ అందిస్తారన్నారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. తొలి రోజైన గురువారం జిల్లా వ్యాప్తంగా ఉన్న 2036 ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు పునఃప్రారంభమైనట్లు ఆమె తెలిపారు.

నర్సిపూడిలో రుణాల పేర గోల్‌మాల్

- భూ యజమానిని, కౌలురైతులను మోసగించిన వైనం
- సంబంధంలేని ఇతరులకు కౌలుకార్డులుమంజూరు
- అసలు రైతు లోన్ కోసం వెళితే బయటపడిన అక్రమాలు
- వాపోతున్న భూ యజమానులు, కౌలు రైతులు

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని నర్సిపూడి లో స్థానిక భూ యజమానులు తమ భూములను కౌలుకు చేసుకునేందుకు కౌలు రైతులకు ఇచ్చారు. అయితే భూ యజమానికి గాని, కౌలు రైతుకు గాని తెలియకుండా రెవెన్యూ అధికారులు సంబంధం లేని ఇతరులకు కౌలు కార్డులు మంజూరు చేశారు. దీంతో ఇదే అదునుగా భావించి అక్రమంగా



రైతు లక్ష్మి భూమిని వెంకటరమణ పేరున కౌలు కార్డు మంజూరు


కౌలు రైతు కార్డు పొందిన వారు స్థానిక చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు నందు లోన్లు తీసుకున్నారు. అయితే అసలు రైతు తమ భూమి మీద లోన్ కోసం స్థానిక సొసైటీ కి వెళ్లారు. అక్కడ సొసైటీ అధికారులు మీ భూమి మీద ఇప్పటికే లోన్ తీసుకుని ఉందని మంజూరు చేయలేమని తెలిపారు. దీంతో రైతులు లబోదిబో మంటూ గురువారం మధ్యాహ్నం చైతన్య గోదావరి బ్యాంక్ అధికారులను సంప్రదించారు. దీంతో వారు వెల్లడించిన వివరాలు ప్రకారం మీ భూములపై లోన్లు తీసుకుని ఉన్నారని వాటి వివరాలు అందజేస్తామని తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం వరకు రైతులు ఆందోళనతో పలు చర్చల అనంతరం సంబంధిత కౌలు కార్డుదారుల వివరాలను జిరాక్సుల రూపంలో అందజేశారు. దీనిపై సంబంధిత భూ యజమానులు, కౌలు రైతులు బ్యాంకు ఆవరణలో విలేకరుల వద్ద తమ గోడు వెళ్ళబోస్తూ వివరాలు వెల్లడించారు. ఇందులో రావిపాటి లక్ష్మికి చెందిన భూమి మీద రూ.2 లక్షలు, పిల్లి వీర వెంకటరమణ కౌలు కార్డు ద్వారా లోను తీసుకున్నట్లు చూపుతోందన్నారు. అలాగే వాసిరెడ్డి వీర వెంకట సత్యనారాయణకు చెందిన భూమి మీద కరిపోతు రాజు కౌలు కార్డుపై రూ.4 లక్షలు వరకు లోను తీసుకున్నట్లు చూపుతోందని బ్యాంక్ అధికారులు వెల్లడించినట్లు రైతులు తెలిపారు. దీనిపై బ్యాంక్ అధికారులను ప్రశ్నించగా రెవెన్యూ అధికారులు మంజూరు చేసిన కౌలు కార్డులపై ఈ లోన్లు మంజూరు చేసినట్లు బ్యాంక్ అధికారులు వెల్లడించారు. ఎంత మంది బాధితులు ఉన్నారనే దానిపై సమగ్ర దర్యాప్తు జరగాల్సి ఉందని వారు అంటున్నారు. ఇందుకు ప్రతి రైతు వ్యక్తిగతంగా పరిశీలన చేసుకుంటే ఎంత అవకతవకలు జరిగాయి అన్న విషయం తేట తెల్లం అవుతుందన్నారు. భూ యజమాని గాని, సంబంధిత భూ కౌలుదారుని, అనుమతి లేకుండా రెవెన్యూ అధికారులు కౌలుకార్డులు ఎలా మంజూరు చేస్తారు. దీనిపై తహశీల్దార్ కు ఫిర్యాదు చేస్తామని బాధితులు తెలిపారు.



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న బాధిత రైతులు

ఫిర్యాదు అందింతే సమగ్ర విచారణ

బాధితులు ఇంతవరకు ఫిర్యాదు చేయలేదని ఫిర్యాదు అందిన వెంటనే సమగ్ర విచారణ చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని విలేకరుల అడిగిన ప్రశ్నకు సమాధానంగా తహశీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు.



రైతు సత్యనారాయణ భూమిని, రాజు పేరున కౌలు కార్డు మంజూరు

వాడపల్లి వెంకన్న హుండీ ఆదాయం రూ.96 లక్షలు

ప్రజాశక్తి -మామిడికుదురు

కోనసమీ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి హుండీ ఆదాయాన్ని గురువారం ఆలయ ముఖ మండపంలో జిల్లా దేవాదాయ శాఖ అధికారి డి.నాగమల్లేశ్వరరావు మరియు మండపేట గ్రూపు దేవాలయాల కార్య నిర్వహణ అధికారి పివివిఎస్.కామేశ్వరరావు పర్యవేక్షణలో లెక్కించారు. 28 రోజులకు హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.96,98,077తో పాటు 33 గ్రాముల బంగారం, 580 గ్రాములు వెండి వచ్చాయని ఆలయ అధికారులు తెలిపారు. అలాగే పలు దేశాల కరెన్సీ నోట్లు వచ్చాయని అధికారులు అన్నారు.

విశ్వేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు

విశ్వేశ్వర స్వామి హుండీ ఆదాయం లెక్కించగా రూ.2,53,083 సమకూరాయని ఆలయ డిసి భూపతి రాజు కిషోర్ కుమార్ తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోచిరాజు బాబురావు, నల్ల సర్పంచ్ కాయలు జగన్నాథం, వాడపల్లి మాజీ చైర్మన్, కరుటూరి నరసింహారావు దేవస్థానం సిబ్బంది అర్చకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలబాలాజీ కళ్యాణం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవాలు ఈనెల 16 నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. ఈ మహోత్సవాల వాల్ పోస్టర్‌ను గురువారం పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ ఆవిష్కరించారు. ముందుగా ఎంఎల్ఎ గిడ్డి ని వేద పండితులచే ఆశీర్వచనాలు అందించి శాలువాతో సత్కరించి సహాయ కమిషనర్ గ్రంధి మాధవి కళ్యాణ మహోత్సవానికి ఆహ్వానిం చారు. అంతకు ముందు ఎంఎల్ఎ గిడ్డి గంటి పెదపూడి సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించి కార్యకర్తలతో క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో దేవస్థానం ఆలయ సిబ్బంది, టిడిపి, జనసేన, ఉమ్మడి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ గిడ్డి

గణపతి ఆలయానికి రూ.50 వేల విరాళం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం అగ్రహారం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ వరసిద్ధి గణపతి ఆలయ నిర్మాణానికి గురువారం పారిశ్రామికవేత్త రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. కపిలేశ్వరపురం గ్రామం నుంచి వ్యాపార రీత్యా తణుకు పట్టణంలో స్థిరపడిన పారిశ్రామికవేత్త కాటూరి లక్ష్మణరావు, విజయ వెంకటలక్ష్మి దంపతులు గణపతి ఆలయాన్ని నిర్మించుకు నేందుకు తన వంతు సహాకారంగా ఆలయా నికి రూ.50 వేల విరాళాన్ని ఆలయ ట్రస్ట్ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



ఆలయ ట్రస్ట్ సభ్యులకు విరాళాన్ని అందిస్తున్న కాటూరి

మోగిన బడిగంట

- తెరుచుకున్న పాఠశాలలు
- మొదటి రోజు సగం మంది పిల్లలు హాజరు

ప్రజాశక్తి-రామచంద్రపురం

వేసవి సెలవులు ముగియడంతో నియోజకవర్గంలో పాఠశాలలు గురువారం నుంచి తెరుచుకున్నాయి. మొదటి రోజు విద్యార్థులు అన్ని పాఠశాలలోని 50శాతం నంది విద్యార్థులు హాజరు అయ్యారు. పాఠశాలలకు ఎప్పటికీ పుస్తకాలు బ్యాగులు, మండల కేంద్రాలకు చేరుకోవడంతో వాటిని మండల విద్యాశాఖ అధికారులు గురువారం ఆయా హైస్కూల్ లకు పాఠశాలలకు చేరవేశారు. ఎప్పటి వరకు జగనన్న నాలుగు నేడు అభివృద్ధి పనులు కొంతమేర పూర్తికాగా కొన్ని పాఠశాలల్లో పనులు నిధులు విడుదల కాక నిలిచిపోయాయి. ఇక మధ్యాహ్నం భోజనం పథకం యథావిధిగా కొనసాగుతోంది. అయితే జగన్ ప్రభుత్వం మారి కూటమి(టిడిపి,జనసేన, బిజెపి) అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగంపై ఏ విధమైన మార్పులు చేస్తారనేది ఇంకా అంతుచిక్కడం లేదు. ఇక పలు పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉంది. కొత్త ప్రభుత్వం రాగానే మెగా డిఎస్‌సి ప్రకటిస్తానని చెప్పడం అటు ఉపాధ్యాయ వత్తులకు వచ్చే అభ్యర్థులకు ఊరట కలిగించింది. ఇక ఈ ఏడాది మెగా డిఎస్‌సి పూర్తి అయితే పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తగ్గే అవకాశం ఉంది. ఇక ప్రభుత్వ పాఠశాలలో నూతన ప్రభుత్వ విధానాన్ని ప్రకటించాల్సి ఉంటుంది. అప్పటివరకు గత వైసిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పుస్తకాలు, పంపిణీ, దుస్తుల పంపిణీ, మధ్యాహ్నం భోజనం పథకం యథావిధిగా కొనసాగే అవకాశం ఉంది.



మొదటిరోజు నామమాత్రంగా హాజరైన విద్యార్థులు

టెక్స్ట్,నోట్ బుక్స్, యూనిఫామ్ అందజేశాం



ఈ విద్యాసంవత్సరానికి రామచంద్రపురం మండలంలో అన్ని పాఠశాలలకు టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్,యూనిఫామ్ అంద జేశాము. రామచంద్రాపురం మం డలంలో 86 పాఠశాలలో ఉన్నా యని వాటిలో 16 హైస్కూల్ కాగా 8 ప్రాథమి కోన్నత పాఠశాలలని, 62 ప్రాథమిక పాఠశాలలోని ఆయన వివరించారు. అయితే పాఠశాలలకు స్కూల్ బ్యాగులు ఇంకా అందలేదని అవి అందిన తర్వాత వాటిని కూడా మంజూరు చేస్తాం. మధ్యా హ్న భోజన పథకం యథావిధిగా అమలవుతుంది.

-ఎం.శ్రీనివాస్,ఎంఇఒ ,రామచంద్రపురం

రాయితీపై వరి విత్తనాలు

ప్రజాశక్తి -మామిడికుదురు


మామిడికుదురు మండల పరిధిలో 3,500 ఎకరాల విస్తీర్ణంలో రైతులకు సబ్జిడీపై 120 కింట్వాల్ వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి బి.మృదుల తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కిలోకు అయిదు రూపాయలు సబ్సిడీపై మండల పరిధిలో పది గ్రామాల్లో అందుబాటులో వరి విత్తనాలను ఉంచామని అన్నారు. ఎంటియు 1318 ఎంటియు, 1064 రకాలు వరి విత్తనాలు రైతులకు సిద్ధముగా ఉన్నాయని అన్నారు. రైతులంతా ముందస్తుగా నారుమడులు వేసి, రైతులంతా ముందస్తు సాగుకు సహకరించాలన్నారు.

వెలిచేరు నుంచి వాడపల్లికి పాదయాత్ర

ప్రజాశక్తి-ఆత్రేయపురం

సిఎంగా చంద్రబాబు, కొత్తపేట ఎంఎల్ఎగా బండారు సత్యానందరావు గెలిచిన సందర్భంగా గురువారం మండలంలోని వెలిచేరు యూజిపాలెం నుంచి 200 మంది వాడపల్లి వెంకటేశ్వర స్వామి సన్నిధికి చేరుకుని మొక్కుబడి తీర్చుకున్నారు. వీరికి మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు ఆత్రేయపురంలో స్వాగతం పలికి పాదయాత్రగా వాడపల్లి వెళ్లారు ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు కవల సత్తిబాబు, మండల బిసి సెల్ అధ్యక్షులు అయిన నాగరాజు నాయకులు, మిద్దె శ్రీరామమూర్తి అయినం అప్పారావు వెంకట్రావు కొండేటి సత్తిబాబు పాల్గొన్నారు

కార్టూ'నిజం'





సరోవరరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

అంబాజీపేట ఎంపిడిఒగా సరోవరరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అంబాజీపేట

అంబాజీపేట ఎంపిడిఒ జివి.సరోవరరావు గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఈయన అల్లవరం ఎంపిడిఒగా విధులు నిర్వహించారు. అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని క్షేత్రస్థాయిలోకి వెళ్ళి పరిశీలించి సత్వరమే సమస్య పరిష్కరించేలా కషి చేస్తానన్నారు. ఇఒపిఆర్‌డి బి.మమత, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల అధికారులు, ఆఫీస్ సిబ్బంది, ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

విద్యుత్ వైర్లు చోరీ

ప్రజాశక్తి-ఆత్రేయపురం

పొలాల్లో విద్యుత్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. వివరాలు ఇవి.. మండలంలోని లొల్ల గ్రామం పంట పొలాల్లో ఉన్న రైతుల వ్యవసాయ బోర్ల విద్యుత్ వైర్లను గుర్తుతెలియని దుండగులు బుధవారం అర్ధరాత్రి మోటార్ పెద్ద తాళాలను బద్దలు కొట్టి విద్యుత్ ఫీజులను నాశనం చేశారు. సుమారు పదిమంది రైతుల మోటార్లలో వైర్లను కట్ చేసి అపహరించారు. దీంతో రైతులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైర్లు కావాలని కత్తిరించారా లేక తాగిన మైకంలో ఇలా చేశారా అనేది తెలియాల్సి ఉంది. మోటారు వైర్లు దొంగిలించిన ప్రదేశంలో ప్రభుత్వం వారి మద్యం దుకాణం ఉండడంతో మందుబాబులే వారు చేసి ఉంటారని రైతులు భావిస్తున్నారు. ఈ విషయాన్ని ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లామని రైతులు పేర్కొన్నారు.

కరెంట్ షాక్‌కు గురైన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

విద్యుత్ షాక్ గురై గాయాల పాలై లైన్ మెన్ చికిత్స పొందుతూ మతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రంపచోడవరం గ్రామానికి చెందిన సంకరు ఈశ్వర్ రెడ్డి(36) రెండు సంవత్సరాలుగా మండలంలోని నార్కేడిమిల్లి గ్రామం లైన్ మాన్ విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి వివాహమైంది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత నెల 16న గ్రామంలో విధులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి గాయాలు అయ్యాయి. అప్పటినుండి రావులపాలెం ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వారం రోజుల క్రితం డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వచ్చాడు. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఈనెల 5న మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం బొల్లినేని హాస్పిటల్ కు తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ గురువారం మతి చెందాడు ఆసుపత్రి నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్. శ్రీనివాసు తెలిపారు.

2,45 కేజీల పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-అమలాపురం

రావులపాలెం మండలములో రావులపాడు గ్రామంలో ఒక ఖాళీ స్థలంలో నిల్వ ఉంచిన 2,645 కేజీల పిడిఎస్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారుల గురువారం స్వాధీనం చేసుకున్నారు. సత్తి సతీష్ తణుకు పరిసర ప్రాంత గ్రామాల్లో కొంత మంది నుంచి కిలో రూ.20లకు కొనుగోలు చేశాడు. అదే బియ్యాన్ని కిలో రూ.22కు ఆలమూరు, జొన్నాడ పరిసర ప్రాంత ఇటుక బట్టీల కార్మికులకు విక్రయిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న అధికారులు తనిఖీలు చేసి బియ్యాన్ని గుర్తించారు. వీటి విలువ రూ.1,28,347 ఉంటుందని తెలిపారు. 6ఎ కింద కేసు నమోదు చేశామని ఎస్‌పి కెవిఎస్‌వి. సుబ్బారెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు నాగ వెంకటరాజు, నవీన్ కుమార్, లోవరాజు, కిశోర్, సిఎస్ డిటి, ఎస్.కె.అలిషా పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని జగన్నాథపురంలో గురువారం ఒక వ్యక్తి అనుమానాస్పాద స్థితిలో మృతి చెందాడు. ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు జగన్నాథపురం గ్రామానికి చెందిన ముళ్లపూడి మణికంఠచౌదరి(31) కోడూరి వెంకటరమణ గోడౌన్ పక్కన ఉన్న మామిడి చెట్టుకు తాడుతో ఉరేసుకుని మృతి చెందినట్లు స్థానికులు సమాచారం ఇచ్చారన్నారు. ఈ మేరకు సిఐ పి.బాలసురేష్‌బాబు, ఎస్ఐ సతీష్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మతుని భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. అప్పుల బాధతో ఉరేసుకుని ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు.

ఎంఎల్ఎ ముప్పిడిని కలిసిన సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి - తాళ్లపూడి

కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావును మండలంలోని సచివాలయ ఉద్యోగులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. సచివాలయ వ్యవస్థ ఏర్పడిన రోజు నుంచి అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కొత్త ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కృషి చేస్తూ అన్ని విధాల సహకారం అందిస్తామని సచివాలయ ఉద్యోగులు తెలిపారు. తమ సమస్యలపై ఎంఎల్ఎ సానుకూలంగా స్పందించారని ఉద్యోగులు తెలిపారు.

రైతు సమస్యల పరిష్కారానికి ముందుంటాం...

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మండలంలో ప్రతి రైతుకు రెవెన్యూ పరమైన పనులు, సమస్యలు ఉంటే పరిష్కారానికి తమ సిబ్బంది ముందు ఉంటారని విఆర్ఒ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఆర్.లక్ష్మణ్‌మూర్తి తెలిపారు. గురువారం విఆర్ఒల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షునిగా జె.సామ్యూల్, ఉపాధ్యక్షురాలిగా టి.శ్రీదేవి, కార్యదర్శిగా ఎం.మాధవి, కోశాధికారిగా కె.శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్.లక్ష్మణమూర్తిని గౌరవాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. అలాగే ఎస్.జ్యోతి, ఎ.వరలక్ష్మి, వి.సమత, సిహెచ్.నాగలక్ష్మి, కె.జ్యోతి సభ్యులుగా కొనసాగుతారని ఆయన తెలిపారు.

పలువురికి తోట రాంజీ పరామర్శ

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం గ్రామంలో పలువురిని వైసిపి యువ నాయకులు మాజీ మంత్రి తోట నటసింహం తనయులు తోట శ్రీరాంజీ గురువారం పరామర్శించారు. ఇటీవలి కంటికి శస్త్ర చికిత్స చేయించుకున్న వైసిపి సీనియర్ నాయకులు సుంకర రమణ, పార్టీ నాయకులు తుమ్మల చిన్నబ్బు అల్లుడు బోలగొండ ఉదయ్ ఇటీవలి ఆకాలమరణం చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు మరణించిన మందపాటి మణిరత్నం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

గోదావరి క్లస్టర్ యూనివర్సిటీకి రూ.10 లక్షల ప్రాజెక్ట్

ప్రజాశక్తి - రాజానగరం

ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వారు గోదావరి క్లస్టర్ యూనివర్సిటీకి ప్రాజెక్ట్‌ను మంజూరు చేశారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్‌లో ఒకరైన నన్నయ విశ్వవిద్యాలయ జంతుశాస్త్ర విభాగ అధ్యాపకులు డాక్టర్ పి.విజయనిర్మలకు ప్రాజెక్ట్ పత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను వీసీ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వారు గోదావరి క్లస్టర్ యూనివర్సిటీలు అయిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ, ఎన్ఐటి తాడేపల్లిగూడెం, డాక్టర్ వైఎస్ఆర్. హార్టికల్చర్ యూనివర్సిటీలకు రూ. 10 లక్షల ప్రాజెక్ట్‌ను మంజూరు చేశారని తెలిపారు. 'వేస్ట్ టు వెల్త్: పెక్టిన్ ఆగ్రో-వేస్ట్ నుంచి విలువ జోడించిన న్యూట్రాస్యూటికల్స్‌గా మార్చడం, ఆహారం, ఫార్మా పరిశ్రమలో సంభావ్య అప్లికేషన్" అనే ప్రాజెక్టును రెండు సంవత్సరాల కాల వ్యవధిలో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్లుగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ జువాలజీ అధ్యాపకులు డాక్టర్ పి.విజయనిర్మల, ఎన్ఐటి తాడేపల్లిగూడెం డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ అధ్యాపకులు డాక్టర్ టి.జగన్మోహన్‌రావు, డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ డిఆర్.సలోమిసునీత వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రాజెక్ట్ బృంద సభ్యులకు రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అభినందనలు తెలిపారు.

రామోజీరావుకు ప్రజా సంఘాల నివాళి


రామోజీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి - పిఠాపురం

ప్రముఖ వ్యాపారవేత్త చెరుకూరి రామోజీరావుకు ప్రజా సంఘాల నాయకులు నివాళి లర్పించారు. గురువారం స్థానిక సూర్యా రాయ విద్యాపీఠ గ్రంథాలయంలో మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ, ప్రజా సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రామోజీరావు మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ ఎన్.సూర్యనారాయణ, వివిధ ప్రజా సంఘాల నాయకులు కెవిఎస్ఎస్. ప్రసాద్, కోనేటి రాజు, ఆర్ఆర్‌బి హెచ్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కేశవరావు, కరణం విశ్వనాథం, కరణం శ్రీనివాస్, వనపర్తి సూర్యనారాయణ, ఏలేటి నానిబాబు పాల్గొన్నారు.

పాలును కల్తీ చేస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

పాలును కల్తీ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సుబ్బారావు హెచ్చరించారు. వినియోగదారుల ఫిర్యాదు మేరకు గురువారం స్థానిక సర్పవరం గ్రామంలో శ్రీ అన్నపూర్ణ మిల్క్ సప్లై కేంద్రంపై ఆయన తనిఖీలు చేపట్టారు. వెన్న శాతం వచ్చే మిషన్లో చెక్ చేసి, ఆవు గేద పాలను సేకరించి లేబరేటరీకి పంపించారు. అనంతరం అపరశుభ్రంగా ఉన్న సప్లై కేంద్రాన్ని, పాలల్లో పడిన ఈగలను అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలలో కల్తీ జరిగినట్లు గుర్తిస్తే కాకినాడ నాగమల్లి తోట జంక్షన్ పైడా వారి వీధిలో ఉన్న ఫుడ్ అండ్ సేఫ్టీ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. లేబరేటరీకి పంపించిన పాలుకు సంబంధించి నివేదిక వచ్చిన తరువాత సంబంధిత సంస్థపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి, జగ్గంపేట

యు.కొత్తపల్లి మండలంలో పలు గ్రామాలకు చెట్టు కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని విద్యుత్ శాఖ ఎఇ ప్రమోద్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు మండలంలోని వాకతిప్ప, కుతుకుడు మిల్లి, కొత్తపల్లి, అమీనాబాద్, సుబ్బంపేట, ఉప్పాడ, మూలపేట తదితర గ్రామాలకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. కావున వినియోగదారులు ఈ అసౌకర్యానికి విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు. అలాగే జగ్గంపేట మండలంలోని రాజాపూడి గ్రామంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఇఇ రత్నలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజపుడి సబ్ స్టేషన్ లో 33 కెవి రాజపుడి ఫీడర్ పరిధిలో కొత్తలైనులు వేసేందుకు అవసరమైన చెట్లు నరికివేత, ఇతర మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. రాజపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల వినియోగదారులంతా ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

మోసగాళ్ల పట్ల జాగ్రత్త అవసరం

ప్రజాశక్తి - జగ్గంపేట

మోసగాళ్ల పట్ల జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని జిల్లా మానవ హక్కుల అధ్యక్షులు కొత్త శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో సూచించారు. గతంలో అనేక రకాల ఫైనాన్స్ బాధితులను చూడటం జరిగిందని, కానీ ఇప్పుడు అప్పులు ఇచ్చేవారు సరికొత్త ఫైనాన్స్ విధానం అమలు చేస్తున్నారన్నారు. కొంతమంది మధ్యతరగతి సామాన్య కుటుంబీకులు అప్పు కావాలని, వాళ్ల దగ్గర ఉన్న రిజిస్ట్రేషన్ డాకుమెంట్స్ పట్టుకుని వెళ్ళగా జిపి పవర్ లీడ్ చేయించుకుని అప్పులు ఇస్తున్నారన్నారు. కొంతకాలం తర్వాత అప్పు తీర్చేందుకు వెళ్లగా మీ ఆస్తి మీది కాదు మాకు ఎప్పుడో రిజిస్ట్ అయిపోయిందని చెబుతున్నారని అన్నారు. అప్పు తీసుకున్నవారిని దౌర్జన్యం చేస్తూ బెదిరిస్తున్నారన్నారు. ఇటువంటి రిజి స్ట్రేషన్ చేయటంతో వారి ఆస్తి వారికి దక్కకుండా పోతుందన్నారు. ఇప్పటికైనా అప్పు తీసుకునే వారు తనకా రిజిస్ట్రేషన్ మాత్రమే చేయాలని సూచించారు.

పవన్‌కు డిప్యూటీ సీఎం పదవిపై సంబరాలు


కేక్‌ను కట్ చేస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి - సామర్లకోట

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకారం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ టిడిపి, జనసేన, బిజెపి నాయకులు సామర్లకోటలో గురువారం సంబరాలు జరుపుకున్నారు. స్థానిక పాత తహశీల్దార్ కార్యాలయం సెంటర్‌లో జనసేన నాయకుల ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి పాల్గొని కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేత్రత్వంలో తమ నేత పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రి గా అవకాశం రావడం గర్వకారణం అన్నారు. ఇద్దరి నాయకత్వంలో రానున్న రోజుల్లో రాష్ట్రం ఎంతో అభివృద్ధి పదంలో ముందుకెలుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సరోజ, పిట్టా జానకి రామారావు, మంచెం సాయి, తోట సాయి, అడబాల కుమార స్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, కంటే జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

పింఛను పెంపు పట్ల హర్షం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఆర్థిక భద్రత కల్పించడం కోసం ప్రభుత్వం నెలనెలా వృద్ధులకు, ఒంటరి మహిళలకు ఇస్తున్న సామాజిక పింఛన్లను రూ.4 వేలకు పెంచడం పట్ల సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు బుద్ధరాజు సత్యనారాయణ రాజు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎపిఐఐసి కాలనీలోని అడబాల ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సిఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే పింఛన్‌ను పెంపుదల చేస్తూ సంతకం చేయడం అభినందనీయమని న్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, సుబ్బారావు, న్యాయవాది పెండెం శ్రీదేవి, ఎస్.నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు మెరుగ్గా ఉండాలి

ప్రజాశక్తి - సామర్లకోట

ఎటువంటి లోపాలకు తావు లేకుండా ప్రభుత్వ పాఠశాల నిర్వహణ మరింత మెరుగ్గా ఉండాలని హెచ్‌ఎంలను ఎంఇఒ-1 వై.శివరామ కృష్ణయ్య ఆదేశించారు. గురువారం నుంచి పాఠశాలలు పున్హప్రారంభమైన సందర్భంగా పవర హైస్కూల్, ప్రైమరీ స్కూల్, పండ్రవాడ అప్పర్ ప్రైమరీ స్కూల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. విద్యార్థులతో కలిసి సహ పంక్తి భోజనం నేలపై కూర్చుని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, టాయిలెట్లు, ఆర్ఒ ప్లాంట్లు శుభ్రత పాటించాలని, ఫ్యాన్లు, గదులు, కిటికీలు, పైకప్పు బూజులు లేకుండా చూడాలన్నారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని సుంకరపాలెం పంచాయతీ చింతాకులవారి పేటలోని విజయ దుర్గా దేవి 13వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బొంతు సత్యనారాయణ ఆధ్వర్యంలో హోమం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వందలాదిమందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

బుచ్చిబాబుని పరామర్శించిన మాజీమంత్రి


బుచ్చిబాబుతో మాట్లాడుతున్న పేర్ని నాని

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పెన సినిమా డైరెక్టర్ సానా బుచ్చిబాబుని మాజీ మంత్రి పేర్ని నాని గురువారం పరామర్శించారు. బుచ్చిబాబు తండ్రి వెంకట్రావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలోనే గురువారం బుచ్చి బాబును ఆయన స్వగృహంలో పేర్ని నాని కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రావు చిన్నారావు, సుదర్శన్, జాను, వైస్ ఎంపిపి దొరబాబు, జనసేన నాయకులు సాన నాగు, పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-ముమ్మిడివరం


మొక్కలు నాటుతున్న డిఇఒ కమలకుమారి

విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరం అని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయం, జిల్లా పరిషత్ బాలుర మరియు బాలికల ఉన్నత పాఠశాలల్లో మండల విద్యాశాఖాధికారి బి.రమణ శ్రీ అధ్యక్షతన జరిగిన మేరిలైఫ్ కార్యక్రమంలో కమల కుమారి ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం మేరిలైఫ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు.దిని ముఖ్య ఉద్దేశ్యం అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లోను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు పేరెంట్స్ కమిటీ సభ్యులు విద్యార్థులతో కలిసి సంయుక్తంగా మేరిలైఫ్ కార్యక్రమం ద్వారా మొక్కలు నాటడమే కాకుండా, నాటిన మొక్కలను పరిరక్షించుకోవాల్సిన అవశ్యకత ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా సిఎంఒ బివివి.సుబ్రహ్మణ్యం, ఎఎంఒ పి.రాంబాబు ఐఈ కో-ఆర్డినేటర్ ఎంవివి.సత్యనారాయణ, ఎంఇఒ-2 ఆర్.ఉదయభాస్కరరావు, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్.పరిమళ, బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.హనుమంతురావు లతో పాటు సిఆర్‌ఎంటి శ్రీనివాసు సహ ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంతాన సాఫల్య కేంద్రాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ప్రయివేటు ఆసుపత్రులు నిర్వహించే సంతాన సాఫల్య కేంద్రాలకు విధిగా మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ యాక్ట్, 1971 అనుమతిని కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. గురువారం స్థానిక జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఎంసిహెచ్ బ్లాక్‌లో నిర్వహించిన ఎంటిపి జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతులు పొందిన ప్రయివేటు ఆసుపత్రుల నుంచి ప్రతి నెలా నిర్దేశించిన ఫార్మేట్‌లో నివేదిక వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కమిటీ సమావేశంలో అనుమతి కోసం వచ్చిన దరఖాస్తులపై చర్చ జరిగింది. దరఖాస్తులను ఆయా ఆసుపత్రిలో సీనియర్ డివిజనల్ అధికారి వారి ద్వారా స్థల పరిశీలన జరిపించి అనుమతులు మంజూరు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సభ్యులు గైనకాలజిస్ట్ పి.శిరీష, జి.అనంతరావు, తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో ఎంఎల్ఎ మద్దిపాటి పూజలు

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్లలోని సాయిబాబా ఆలయంలో గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకట్రాజు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. బాబా విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గోపాలపురం నియోజకవర్గం నుంచి మద్దిపాటి గెలవాలని స్థానిక మండల నాయకులు కండెపు వెంకటరత్నం, యలమాటి శ్రీనివాసరావు, నిమ్మలపూడి ప్రసాదు తదితరులు సాయిబాబా సన్నిధిలో మొక్కుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు మొక్కు తీర్చుకున్నామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయకట్టుకు నీరు విడుదల

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు మండలం విజ్జేశ్వరం గ్రామంలో పెండ్యాల పంపింగ్ స్కీం నుంచి 6,626 ఎకరాల ఆయకట్టుకు నిడదవోలు ఎంఎల్ఎ, మంత్రి కందుల దుర్గేష్ సాగునీటిని గురువారం విడుదల చేశారు. ఆయన వెంట మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు, ప్రభుత్వ అధికారులు, రైతులు, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు. అలాగే తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ఆయనకు పూలమాలలు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన టిడిపి పట్టణ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వర, రంగా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత


ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - సామర్లకోట

నీటి సంరక్షణ మనందరి బాధ్యతగా భావించాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ అన్నారు. గురువారం పాఠశాల ఎకో క్లబ్ కార్యక్రమాల్లో భాగంగా 'జల వనరుల పొదుపు, లీకేజీలు అరికట్టడం ద్వారా ఉపయోగాలు' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులు నీటి పొదుపుపై తీసుకునే జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎకో క్లబ్ కన్వీనర్ ఎఎల్‌వి.కుమారి, కన్వీనర్ కె.శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంఠం, టీచర్లు వి.రాజు, జి.గోవిందు, కె.అరుణ, కెవివి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కాపు కళ్యాణ మండపం పనుల పరిశీలన


మండపాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానికంగా అసంపూర్తిగా నిలిచిపోయిన కాపు కళ్యాణ మండపాన్ని గురువారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ జె.రామారావు టిడిపి, జనసేన నాయకులతో కలిసి పరిశీలించారు. గురువారం ఉదయం పెద్దాపురంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పెద్దాపురం, సామర్లకోట మండ లాలకు చెందిన అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ నేపథ్యంలోనే మున్సిపల్ కార్యలయం చెంతనే ఉన్న కళ్యాణ మండపం పరిస్థితిని పరిశీలించారు. ప్రారంభానికి నోచుకోకుండానే శిథిలావస్థకు చేరుకుంటున్న మరుగుదొడ్లు, ముఖద్వారం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటాన్ని ఆయన గమనించారు. ఐదేళ్లుగా కళ్యాణ మండపం నిర్లక్ష్యానికి గురవడంతో నిరూపయోగంగా మారిందని టిడిపి, జనసేన నాయకులు అన్నారు. కళ్యాణ మండపం మిగిలిన పనులు వెంటనే పూర్తి చేయాలని ఇంజనీరింగ్ సెక్రటరీ సాగర్, ఇతర అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ పర్యటనలో టిడిపి, జనసేన నాయకులు అడబాల కుమారుస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీశ్, బలుసు వాసు, సరోజ వాసు, అత్తిలి కృష్ణ, పిట్టా జానకిరామారావు, తుమ్మల ప్రసాద్, తుమ్మల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మానసిక ఎదుగుదల లోపమే ఆటిజం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

వయసుకు తగ్గట్టు పిల్లల్లో రావలసిన మానసిక ఎదుగుదల లోపాన్ని ఆటిజం అంటామని పిఎంపి వైద్యులు కుమార యాదవ్ అన్నారు. గురువారం బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల మెదడులోని కొంత భాగం సరిగా పనిచేయందున ఈ వ్యాధి ఉన్న పిల్లలు మామూలు పిల్లల మాదిరిగా వ్యవహరించరని అన్నారు. మూడేళ్ల వయసు నిండకముందే ఈ వ్యాధి లక్షణాలు పిల్లలలో కనపడతాయని అన్నారు. దీనికి లింగ వివక్షత లేదన్నారు. ప్రతి వంద మంది పిల్లల్లో ఒకరికి మాత్రమే ఈ వ్యాధి వస్తుందని అన్నారు. ఇది చాలా అరుదైన సమస్య అని అన్నారు. జన్యుపరమైన కారణాలు, నెలలు నిండకముందే శిశువు జన్మించడం, గర్భధారణ సమయంలో ఇన్ఫెక్షన్ల భారిన పడటం ఈ వ్యాధికి కారణాలని అన్నారు. ఈ వ్యాధి ఉన్న పిల్లలకు మూర్ఛ, నిరాశ, ఆందోళన వంటివి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. దీని నివారణకు చిన్న వయసు నుంచి పిల్లలు ఆరోగ్యంగా ఎదగడానికి పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ఎస్.శ్రీనగేష్ తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు


అధికారులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ అశోక్

అధికారులతో ఎంఎల్ఎ అశోక్ సమీక్ష

ప్రజాశక్తి - యానాం

ప్రజా పనులు శాఖ (పిడబ్ల్యుడి) అధికారులతో స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తన కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అశోక్ మాట్లాడుతూ ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, నియోజకవర్గంలో రోడ్లకు ఇరువైపులా మొక్కలు, పొదలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నారని అన్నారు. వాటిని తక్షణమే తొలగించాలని అన్నారు. వచ్చేది వర్షాకాలం కాబట్టి ప్రధాన డ్రెయిన్లు శుభ్రం చేయాలని సూచించారు. దరియాలతిప్పలో సొసైటీ భూములు వరదలు తాకిడి వల్ల ముంపునకు గురవుతున్నాయని, అందుకు రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిడబ్ల్యుడి ఇఇ చంద్రశేఖరన్, భాస్కర్, బొడ్డు ప్రసాద్, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ అశోక్‌ను కలిసిన ఎఇ మూర్తి

ప్రజాశక్తి - యానాం

విద్యుత్ శాఖలో జూనియర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ ఇటీవల అసిస్టెంట్ ఇంజనీర్‌గా పదోన్నతి పొందిన ముగ్గాల మూర్తి ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అశోక్ ను శాలువాతో సత్కరించారు. అనంతరం విద్యుత్ శాఖకు సంబంధించి పలు అంశాలను చర్చించారు. కొన్ని గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు లేవని వాటిని తక్షణమే ఏర్పాటు చేసి నూతన లైట్లు వేయాలని ఆదేశించారు. వచ్చేది వర్షాకాలం కాబట్టి విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

కళాశాల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఎస్‌టిపిపి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలను పరిష్కరించాలని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను అధ్యాపకులు కోరారు. గురువారం ఎంఎల్ఎను కలిసిన అధ్యాపకులు కళాశాలలో ఉన్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఫిజిక్స్, హిస్టరీ సబ్జెక్టులు బోధించడానికి అధ్యాపకుల కొరత ఉందని, అందువల్లే తాము 100 శాతం ఉత్తీర్ణత సాధించలేకపోతున్నామని అన్నారు. గతంతో పోలిస్తే అడ్మిషన్స్ కూడా తగ్గాయని తెలిపారు. దానికి గల కారణాలను ఆయనకు వివరించారు. అలాగే గ్రంథాలయంలో లైబ్రేరియన్ పోస్ట్ ఖాళీగా ఉందని దానిని భర్తీ చేయాలని కోరారు. ఎంఎల్ఎ అశోక్ మాట్లాడుతూ కళాశాల సమస్యలను ఉన్నత స్థాయి విద్యాశాఖ అధికారులకు, హోం మంత్రి నమశ్శివాయం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. సిబిఎస్ఇ సిలబస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు.